## ఐటీడీఏలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

విశాలాంధ్ర-సీతంపేట : స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఐటిడిఏ కార్యాలయ పరిసరాలను ఐటిడిఏ నూతన ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ శనివారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిసరాలలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను, ఇతర చెత్తను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పరిసరాలను శుభ్రం చేయడంలో ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర యొక్క ప్రతిజ్ఞను అధికారులు సిబ్బందితో కలిసి చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఏపీవో జి. చిన్నబాబు, ఏవో వి.సునీల్, అకౌంట్స్ అధికారి విజయరాణి, పీహెచ్ఓ వెంకట గణేష్, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టంగుటూరి ప్రకాశం జయంతి వేడుకలు

విశాలాంధ్ర-పార్వతీపురం : టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక హాజరై టంగుటూరు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పని చేశారని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో బ్రిటీష్ తుపాకీకి ఎదురు నిలిచి గుండె చూపిన ధైర్యశీలి అని అన్నారు. అకుంఠిత ధైర్యసాహసాలకు, అసమాన త్యాగనిరతికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన టంగుటూరి ప్రకాశం పంతులు నేటి తరానికి ఆదర్శమని ఆమె ప్రశంశించారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయంలోని పలు విభాగాల పర్యవేక్షకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని ప్రకాశం పంతులుకు నివాళులు

పార్వతీపురం టౌన్/బెలగాం : ఆంధ్రరాష్ట్ర తొలి

ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి సందర్భంగా పార్వతీపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కొమిరి కృష్ణమూర్తి ఐ.ఆర్.పి.డబ్ల్యూ.ఎ నిర్వహిస్తున్న రైతు బజార్ సమీపంలో ఉన్న పార్వతీపురం పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలోని నిరాశ్రయులకు బియ్యం పాకెట్లు, కిరాణా సామాగ్రి, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది వై.గణేష్, జి. జాని తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ అగ్రనేత 'సురవరం' మృతి దేశానికి తీరని లోటు

విశాలాంధ్ర-బెలగాం : సిపిఐ అగ్ర నేత సురవరం సుధాకర్ రెడ్డి మృతి దేశానికి తీరని లోటని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ సురవరం దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసారని వివరించారు.

**సిపిఎం సంతాపం**

పార్వతీపురం టౌన్ : సిపిఐ పార్టీ ఆల్ ఇండియా మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మృతికి సిపిఎం పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ సంతాపం తెలియజేస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి కోల్లిగంగునాయుడు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి దశ నుంచి పేద ప్రజల తరఫున కష్టజీవులు తరఫున పోరాటాలు చేశారని తన కుటుంబం స్వాతంత్రయోద్యమం స్ఫూర్తి పొందిన కుటుంబమన్నారు. 1998, 2004లో వామపక్ష పార్టీల అభ్యర్థిగా నల్లగొండ లోక్సభ నియోజకవర్గము నుంచి పార్లమెంటు సభ్యుడుగా గెలుపొంది ప్రజల సమస్యలపై పార్లమెంటులో పోరాడారని అన్నారు అలాగే 2012 నుండి 2019 వరకు సిపిఐ పార్టీ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శిగా ఉంటూ వామపక్ష ఉద్యమాలకు ఊపిరి పోసారని అన్నారు అలాగే 2000 సంవత్సరంలో విద్యుత్ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఈరోజు సురవరం సుధాకర్ రెడ్డి మరణించడం వామపక్ష ఉద్యమానికే తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇందిర పాల్గొన్నారు.

## ఏకగ్రీవ ప్రధాన కార్యదర్శిగా బిటువాడ హెచ్ఎం ఎన్నిక హర్షనీయం

విశాలాంధ్ర-వీరఘట్టం : మండలం బిటువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న సిహెచ్ రత్నాకర్ రావుని పార్వతీపురం మన్యం జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది, ఈ సందర్భంగా తమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారికి అరుదైన గౌరవం దక్కినందుకు పాఠశాల ఉపాధ్యాయుల కార్యదర్శి సిర్లపు ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేయడమైనది ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ సిహెచ్ రత్నాకర్ రావు గారు మాట్లాడుతూ నిరంతరం శ్రమిస్తూ మనకు అప్పజెప్పిన పనులను సక్రమంగా సమయం కంటే ముందుగా పూర్తి చేసుకోవడం ద్వారా ఉన్నత స్థితికి ఎదగవచ్చని ఆయన సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు వెంకటరమణ చిన్నారావు శ్రీనివాసరావు పురుషోత్తం మోహన్ రావు గంగు మోహన్ రావు, పావని మరియు గౌరీ నీలమ్మ, కమలమ్మ మొదలగు సిబ్బంది ఎంతో ఆనందంతో పాల్గొని అభినందనలు తెలిపారు అలాగే బిటివాడ గ్రామ పెద్దలు లింగాల రాజారత్నం కుమార్ మరియు పాఠశాల విద్య కమిటీ చైర్మన్ సతివాడ రమాదేవి వెంకటరమణ దంపతులు ఎక్స్ అఫీషియో నెంబర్ శ్రీరామ్ జగదీష్ కుమార్, విద్యార్థినీ విద్యార్థులు మొదలగువారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రత్నాకర్‌ని ఘనంగా సత్కరించారు.

## గట్లపై కంది పంటతో అదనపు ఆదాయం

**వ్యవసాయ అధికారి తిరుపతిరావు**

విశాలాంధ్ర-పాచిపెంట : ప్రభుత్వం రైతులు అదనపు ఆదాయం పొందడం కోసం అంతర పంటలు కంచె పంటలు, పొలం గట్ల మీద వేసుకోవడం కోసం వ్యవసాయ శాఖ ద్వారా కంది విత్తనాలను పూర్తి ఉచితంగా రైతులకు అందజేస్తుందని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు అన్నారు. కర్రీవలస లో రైతు కంద తవిటి నాయుడు వరి పొలంలో వరుసలలో నాట్లు వేయిస్తూ గట్ల మీద కంది విత్తనాలను నాటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఏకపంట విధానాన్ని వదిలి అంతర పంటలు వేసుకున్నట్లయితే అధిక దిగుబడితోపాటు అదనపు ఆదాయం కూడా వస్తుందన్నారు. వరి పొలం గట్లు మీద కందులు వేసేటప్పుడు గట్టుమీద కాకుండా గట్టు మధ్యలో పొలం నుంచి జానెడు ఎత్తులో వేసుకున్నట్లయితే నీటి ఎద్దడి లేకుండా ఏపుగా పెరిగి మంచి అదనపు ఆదాయం వస్తుందని కనీసం ఇంటి అవసరాలు తీరిపోతాయని తెలిపారు. పత్తి పంటలో కంది అపరాలు సాగు చేయడం వలన వీటి వేర్ల పై ఉన్న బుడిపిల ద్వారా గాలిలో ఉన్న నత్రజనిని భూమిలో స్థిరీకరించి పంటకు అందేటట్లు చేస్తుందని దీనివలన ప్రధాన పంట ఆరోగ్యంగా పెరుగుతుందన్నారు. అంతేకాకుండా మిత్ర పురుగులు కూడా బాగా వృద్ధి చెందుతాయని జీవ వైవిధ్యం పెరుగుతుందని కలుపు ఉధృతి కూడా తగ్గుతుందని తెలిపారు. కాబట్టి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి సేద్య సిబ్బంది విజయ్ మరియు సుమలత పాల్గొన్నారు.

## గ్రామాలను, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడమే స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యం

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం ఇరిడి గ్రామంలో మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ఈ మేరకు గ్రామంలో స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ గ్రామస్తులతో ర్యాలీ చేపట్టారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం వలన సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని వివరించారు. గ్రామంలో చీపురుపట్టి చెత్తాచెదారాన్ని స్వయంగా ఊడ్చి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక పాఠశాలలో విద్యార్థులతో చేపట్టిన హ్యాండ్ వాష్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పార్వతిపురం మన్యం జిల్లా ఐసిడిఎస్ పిడి ఏఎంసీ చైర్మన్ కడ్రక కళావతి మండల ఎంపీడీవో త్రివిక్రమ్ గుమ్మలక్ష్మీపురం మండలం ఎంఈఓ చంద్రశేఖర్ గుమ్మలక్ష్మీపురం ఐసిడిఎస్ పిడి విజయ్ గౌరీ గుమ్మలక్ష్మీ పురం మండల పార్టీ అధ్యక్షులు అద్దాకు నరేష్ జనసేన ఇంచార్జ్ కడ్రక మల్లేష్ బిజెపి మండల పార్టీ అధ్యక్షులు అప్పలస్వామి మాజీ కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, మండలంలో ఉన్న ముఖ్య కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం : స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ప్రధాన లక్ష్యం

గ్రామాలను, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడమే అని పార్వతీపురం సబ్ కలెక్టర్ డాక్టర్ ఆర్.వైశాలి అన్నారు. శనివారం పార్వతీపురం సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొని చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రం చేశారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతో భాగస్వాములు కావాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి వ్యక్తిగత, సామాజిక బాధ్యతను పెంచడం దీని యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. చెత్తను సేకరించి దాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో వేరు చేసి రీసైకిల్ చేయాలన్నారు. డయేరియా, మలేరియా, చికున్ గునియా వంటి తదితర రోగాల బారిన పడకుండా ఉండాలంటే పరిశుభ్రత వాతావరణం నిర్మించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో పార్వతీపురం సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

విశాలాంధ్ర-సాలూరు : మండలంలో మామిడిపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు కోట అయ్యప్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థులు గంగవంశం చరిష్మా, నీలిరోతు రాజ్యలక్ష్మిలు SLV, PSLV, GSLV నమూనా రాకెట్‌లు, శాటిలైట్‌లు తయారుచేసి చంద్రయాన్ 3 ప్రయోగాన్ని మిగిలిన విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాట్లాడుతూ చంద్రయాన్ 3 చంద్రునిపై విజయవంతంగా దక్షిణ ధృవం వైపు ల్యాండింగ్ అయిన రోజున పురస్కరించుకొని ఆగస్టు 23వ తేదీని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకోవాలని భారత ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) చంద్రయాన్-3 ల్యాండర్ ను,రోవర్ ను చంద్రుని పై విజయవంతంగా ల్యాండ్ చేయడం ద్వారా ఒక మైలురాయిని చేరుకుందన్నారు. ఇస్రో చేపట్టిన వివిధ అంతరిక్ష ప్రయోగాలు మానవ వికాసంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.అంతరిక్ష ప్రయోగాలలో ముందున్న దేశాలు ప్రపంచ భవిష్యత్‌ను శాసిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వినాయక చవితి సందర్భంగా ఏవిధమైన అల్లర్లు జరిగినా కఠిన చర్యలు

**మండల తహసీల్దార్ వై విజయలక్ష్మి**

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని 31 పంచాయతీల పరిధిలో గల గ్రామాల యువత ఈ నెల 27 నుండి జరగబోవు వినాయక చవితి పండగలో ఎలాంటి అల్లర్లు, గొడవలకు దిగిన వారిపై కఠిన చర్యలు తప్పవని మండల తహసీల్దార్ వై జయలక్ష్మి హెచ్చరించారు. శనివారం గెడ్డతిరువాడ, ఇటిక,బి.జె.పురం, తురకనాయుడు వలస గ్రామాల నుండి వచ్చిన యువకులకు హెచ్చరించారు ఏ విధమైన గొడవలు అల్లర్లు జరిగినా ఆయా కమిటీల సభ్యులపై బైండోవర్ కెసులను బుక్ చేస్తామని ఎలాంటి అల్లర్లకు పాల్పడవద్దని తెలిపారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయలు జరిమానా విధిస్తూ జైలు శిక్ష కూడా ఉంటుందని హెచ్చరించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఈఏడాదిలో మొట్ట మొదటి పండగ అయినా వినాయక చవితిని ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని ఆమె కోరారు.

## కాఫీ, మిరియాలు మొక్కల రైతులకు నష్టపరిహారం ఇవ్వటంలో అధికారులు జాప్యం

విశాలాంధ్ర-జికే విధి : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కాఫీ తోటలు, మిరియాలు మొక్కలు నష్టపోతున్న రైతులకు నేషనల్ హైవే అథారిటీ,ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందిస్తుందని జీకే వీధి తహసిల్దార్ హెచ్ అన్నాజీరావు అన్నారు. పెదవలస పంచాయతీ కార్యాలయంలో కాఫీ, మిరియాలు మొక్కలు నష్టపోతున్న రైతులతో నేషనల్ హైవే అథారిటీ అధికారులు, జికె వీధి తాసిల్దార్ సమావేశం అయ్యారు. పలువురు రైతులు మాట్లాడుతూ కాఫీ, మిరియాలు మొక్కలు తొలగింపు క్రమంలో రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం ఆలస్యం జరిగిందని నేషనల్ హైవే అథారిటీ జీకే వీధి తహసిల్దార్ ఎదుట రైతులు మాట్లాడి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీకే వీధి తాసిల్దార్ హెచ్ అన్నాజీరావు మాట్లాడుతూ కాఫీ, మిరియాలు మొక్కలు నష్టపోతున్న రైతులందరికీ నష్టపరిహారం చెల్లింపులు జరుగుతాయని, రిజర్వ్ ఫారెస్ట్ ల్యాండ్‌కు మాత్రం ఎలాంటి నష్టపరిహారం ఉండదన్నారు. పెదవలస, చాపరాతిపాలెం, రంపులు గ్రామాల కాఫీ మిరియాలు నష్టపోతున్న రైతుల సమస్యను సబ్ కలెక్టర్, కలెక్టర్ దృష్టికి ఈవిషయమై ఇప్పటికే మాట్లాడటం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సురవరం మరణం సిపిఐకి తీరని లోటు

**- జోహార్ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి - ఎర్ర జెండా ముద్దుబిడ్డకు అశ్రు నివాళి**

**సీపీఐ అల్లూరి జిల్లా కార్యదర్శి సత్యనారాయణ**

విశాలాంధ్ర-చింతపల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ అగ్ర నాయకుడు, ఎర్రజెండా ముద్దు బిడ్డ, ఆ పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, నల్గొండ మాజీ పార్లమెంట్ సభ్యులు, ఉత్తమ పార్లమెంటేరియన్ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం పార్టీకి తీరని లోటుని సిపిఐ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, చింతపల్లి మండల కార్యదర్శి పేట్ల పోతురాజు, అంజని శనివారం సర్పంచ్ పేట్ల రాజుబాబు, ఆ పార్టీ సీనియర్ నాయకుడు సుంకరి విష్ణుమూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్ రహిమాన్ (బుజ్జి), చింతపల్లి మాజీ ఉపసర్పంచ్ గంజారి రమణ లు అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీకి సురవరం సుధాకర్ రెడ్డి చేసిన సేవలు మరువలేని వన్నారు. ఆయన మరణం తమను కలచివేసిందన్నారు. ఒంగోలు వేదికగా మహాసభలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఎర్ర జెండా ముద్దుబిడ్డ, ఉత్తమ పార్లమెంటేరియన్, సిపిఐ అగ్రనేత కాలం చేయడం కంటతడి పెట్టించిందన్నారు. ఉద్యమాలకు ఊపిరి లూధిన సురవరం హైదరాబాదులో మృతి చెందారన్న విషయం తెలిసి చింతిస్తున్నామన్నారు. ఆయన కుటుంబానికి భగవంతుడు మనో నిబ్బరాన్ని ప్రసాదించాలని ఈ సందర్భంగా ఆయనకు వారు నివాళులు అర్పించారు.

## దుంబ్రిగుడలో ఏకీగ్రవంగా పీసా ఎన్నికలు

**ఉపాధ్యక్ష, కార్యదర్శిగా శంకరరావు, సింహాద్రి**

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : మండల కేంద్రం దుంబ్రిగుడలో పిసా కమిటీ ఎన్నికల అధికారిని సునీత ఆధ్వర్యంలో ఏకీ గ్రవంగా పీసా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈసందర్భంగా పిసా కమిటీ ఉపాధ్యక్షుడిగా టీ.శంకర్రావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.సింహాద్రిని గ్రామస్తులు ఏకీగ్రవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిని ఉపాధ్యక్ష, కార్యదర్శికి ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి సమస్యలు వచ్చిన పరిష్కరించేందుకు మా శక్తికి మించి కృషి చేస్తామని చెప్పారు. గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిసా కమిటీ ఎన్నికల సిబ్బంది, తెలుగుదేశం పార్టీ టిఎన్టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి స్వామి, మాజీ జెడ్పిటిసి శ్రీరాములు, వైసీపీ మండల నాయకులు విజయదశమి, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీలకు ఒక న్యాయం..! గిరిజనేతరులకు మరో న్యాయమా..!

**అల్లూరి జిల్లా డ్వామా పిడి వ్యవహార శైలిపై భగ్గుమన్న ఏపీ గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ**

విశాలాంధ్ర-పాడేరు : డ్వామా పిడి కార్యాలయంలో గిరిజనులకు ఒక న్యాయం గిరిజనేతరులకు మరో న్యాయమా? అని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఒక (టిఏ) ముగ్గురు (సిఓ)లు ఈ నలుగురు ఆదివాసి ఉద్యోగులను ఎటువంటి ఏ కారణాలు లేకుండా డ్వామా పిడి టిటిసి (టెంపరరీ, అవుట్ ఆఫ్, కాంట్రాక్ట్ ఆర్డర్ ఇష్యూ)ను ఆ నలుగురిని నిలుపుదల చేశారు. వీరికి మూడు నెలల తర్వాత రీ జ్వానింగ్ చేసుకుంటామని డ్వామా పిడి ఆదేశాలు జారీ చేసి ఉన్నారు. ఇదిలాఉండగా పాడేరు ఎంజిఎన్ఆర్జిఎస్ లో విధులు నిర్వహిస్తున్న ఏపీవో విధులకు గైరజార్ అవడంతో, అల్లూరి జిల్లా డ్వామా పీడీ ఆగస్టు 15వ తేదీన (టిటిసి)లో పెట్టి వారం రోజులు గడవకముందే ఏపీవో గతంలో పనిచేసిన ఆఫీస్ నందు రీపోస్టింగ్ ఇవ్వటం జరిగింది.ఆదివాసి ఉద్యోగులు గత నెల రోజులుగా ఆఫీసు చుట్టూ తిరుగుతున్న కనీసం రీ పోస్టింగ్ ఇవ్వకుండా తిప్పించుకుంటున్న జిల్లా స్థాయి అధికారులు. గిరిజ నేతర ఉద్యోగుని వారం రోజులు కాకుండా అదే మండలంలో రిపోస్టింగ్ ఎలా ఇచ్చారో, ఆదివాసులకు ఒక న్యాయం..! గిరిజనేతరులకు మరో న్యాయమా...!! దీనికి జిల్లాస్థాయి అధికారులు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే గిరిజన ప్రజలందరినీ ఐక్యం చేసి డ్వామా కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న గిరిజనేతర అధికారులు గిరిజనులపై చిన్న చూపు చూడడం సరైన పద్ధతి కాదని గిరిజనుల కోసమే గిరిజన ప్రాంతంలో పనిచేయడానికి వచ్చి గిరిజనులనే కించపరిచే వ్యవహారం చేయడం అధిక ప్రాధాన్యత గిరిజనేతరులకు ఇవ్వడం చేస్తే పెద్దఎత్తున ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి వస్తుందని ఇప్పటికైనా డ్వామా పిడి వ్యవహార శైలి మార్చుకొవారన్నారు.

## గిరిజన భూములకు ప్రత్యామ్నాయ భూములు ఇవ్వాల్సిందే : కలెక్టర్ దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : పోల వరం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు, గిరిజనులకు ప్రత్యామ్నాయ భూములివ్వాల్సిందేనని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. శనివారం కలెక్టరేట్ నుండి రంపచోడవరం, చింతూరు డివిజన్ అధికారులు, తాహశీల్దారులు, పోలవరం పరిపాలనాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిరు. రైతులకు ప్రత్యామ్నాయ భూములు సేకరణ, పునరావాసం, పునరేర్పాట్లుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. పునరావాస కాలనీలకు ప్రజలను తరలించడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఇటీవల వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటించినపుడు పునరావాస కాలనీలకు విద్యుత్తు, మంచినీటి సదుపాయాలు లేవని సంబంధిత ప్రజలు తన దృష్టి తీసుకుని వచ్చారని అన్నారు. పునరావాస కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. ఇంకా 4500 ఎకరాల భూమిని సమీకరించాలన్నారు. రైతులకు వ్యవసాయం చేయడానికి అనువుగా ఉన్న భూములను సమీకరించాలని చెప్పారు. పునరావాస కాలనీలకు దూరంగా రైతులకు భూములు కేటాయిస్తే ప్రయోజనం ఉండదని, గ్రామాలకు రెండు మూడు కిలోమీటర్ల దూరం 56 వ్యవసాయానికి భూములను కేటాయించాలని సూచించారు. జీలుగు మిల్లి, బుట్టాయ గూడెం, కుక్కనూరు గ్రామాల్లో భూములు సేకరించా లని ఆదేశించారు. ఇందుకూరు పేట గ్రామానికి స్మశాన వాటికకు భూమిని సేకరించాలని చెప్పారు. ఈ సమావేశంలో పోలవరం పరిపాలనాధికారి వి.అభిషేక్, రంపచోడవరం ఐటిడి ఏపిఓ కె.సింహచలం, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, చింతూరు పి ఓ అపూర్వ భరత్, ప్రత్యేక ఉప కలెక్టర్ అంబేద్కర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆశ కార్యకర్తల ఉద్యోగాలు అర్హులైనవారికే ఇవ్వాలి

**పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలి**

**ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్**

విశాలాంధ్ర-అరకులోయ : అల్లూరి జిల్లాలో ఆశా కార్యకర్త ఉద్యోగ నియామకానికి దళారీలు, మధ్యవర్తులు కాసుల పంట పండిస్తున్నా రంటున్న నేపథ్యంలో సంబంధిత ప్రభుత్వ అధికారులు పారదర్శకంగా అర్హులైన వారికే ఆశ కార్యకర్తల ఉద్యోగాలు నియామకాలు చేపట్టాలని ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బలదేవ్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో 124 ఆశ కార్యకర్తల ఉద్యోగ పోస్టుల భర్తీకి జిల్లా కలెక్టర్ గతంలో దరఖాస్తులు ఆహ్వానించారు. వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చినప్పటికీ ఒక ఆశ కార్యకర్త ఉద్యోగ పోస్టుకు స్థానిక వైద్యాధికారి,మరియు పంచాయతీ సర్పంచ్ తో కూడిన కమిటీ ముగ్గురు పేర్లు సిఫార్సు చేసినట్టు ఆయన తెలిపారు. అర్హులైన వారికి సిఫార్సు చేసిన ముగ్గురిలో ఒకరికి ఆశా కార్యకర్త ఉద్యోగం వచ్చే అవకాశం ఉంది. 124 ఆశా కార్యకర్తల పోస్టులకు సిఫార్సు కాపాడినవారు 372 దరఖాస్తులు మాత్రమే డిఎం అండ్ హెచ్ ఓ కార్యాలయానికి పంపించి ఉన్నారు ఈ జాబితా సంపాదించిన కొంతమంది దళారులు మధ్యవర్తులు ఒక్కొక్క ఆశ కార్యకర్త ఉద్యోగానికి లక్షల రూపాయలు డిమాండ్ చేస్తూ డబ్బులు ఇచ్చిన వారికే ఉద్యోగాలు వస్తాయని గ్రామాల్లో లబ్ధిదారులకు అసలు రేకెత్ నుంచి డబ్బులు దండుకుంటున్నారు తక్షణమే జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత ప్రభుత్వాలు స్పందించి ఆశ కార్యకర్తల ఉద్యోగ నియామకాలు అర్హులైన వారికి పారదర్శకంగా ఎటువంటి అనుమానాలకు తావు లేకుండా తక్షణమే నియామకాలు చేపట్టాలని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.

## డీఎస్సీలో స్టేట్ ర్యాంకులో మెరిసిన కంటారం యువకులు

విశాలాంధ్ర-కొయ్యూరు : ఉపాధ్యాయులుగా మేం సైతం సాధిస్తమంటూ ప్రతిన బూనిన మారుమూల గ్రామాల్లో ఇద్దరు యువకులు ఏకంగా స్టేట్ ర్యాంక్ లు పొంది గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందనలు పొంది గ్రామానికి మంచి పేరు తెచ్చారని కొనియాడుతున్నారు. ఈ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొయ్యూరు మండలం లో మారుమూల నున్న కంతరం గ్రామానికి చెందిన అనిమిరెడ్డి సూర్య శివకిరణ్ కుమార్ 118ర్యాంక్ సాధించగా, అదే గ్రామానికి చెందిన బొడ్డు శివ 122ర్యాంక్‌తో డిఎస్‌సి ఫలితాల్లో విజయం సాధించారు. ఒకే గ్రామంలో ఇద్దరు స్టేట్ ర్యాంక్‌లు సాధించిన సమాచారం తెలిసిన గ్రామస్తులు, వారి తల్లిదండ్రులతో పాటు జనసేన పార్టీ పంచాయితీ అధ్యక్షులు గంటా శివాజీ, పెద్దలు, మహిళలు వారికి అభినందనలు తెలివి హర్షం వ్యక్తం చేశారు. మారుమూల నున్న పాఠశాలలోనే చదివి ఉపాధ్యయులుగా ఉద్యోగం పొందిన ఇద్దరినీ ఆదర్శంగా తీసుకుని భవిష్యత్ కార్యాచరణతో గ్రామ విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు.

## పాఠశాలను ఏజెన్సీ డిఈఓ తనిఖీ

విశాలాంధ్ర-గంగవరం : శనివారం నాడు మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్ గంగవరం పాఠశాలను తనిఖీ చేయడమైనది. ఉపాధ్యాయ హాజరు విద్యార్థుల హాజరు పరిశీలించడమైనది. విద్యార్థులు 54 మంది గాను 46 మంది విద్యార్థులు హాజరైనారు. నూరు శాతం హాజరు ఉండేటట్లుగా చూడవలెనని ప్రధానోపాధ్యాయుల వారిని సూచించడం అయినది. ఉపాధ్యాయులు విద్యార్థులు తప్పనిసరిగా లీవ్ హాజరు మరియు ఆన్లైన్ హాజరు వేయవలెనని సూచించడం అయినది. ఉపాధ్యాయుల యొక్క డైరీలు లెసన్ ప్లాన్స్ పరిశీలించడమైనది. విద్యార్థుల యొక్క సామర్థ్యాలను పరిశీలించడం అయినది. విద్యార్థుల నోట్ పుస్తకములు వర్క్ బుక్స్ పరిశీలించడం అయినది. సక్రమంగా రాయచున్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకమైనటువంటి తర్ఫీదు ఇవ్వవలెనని ప్రధానోపాధ్యాయుల వారిని సూచించడం అయినది. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర (శాస) కార్యక్రమంను పాఠశాలలో అమలు చేసి ఉన్నారు. బేస్ లైన్ గ్రేడింగ్స్ ని పరిశీలించడమైనది. డి గ్రేడ్‌లో ఉన్నటువంటి విద్యార్థులకు 45 రోజులు పాటు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని ఏ గ్రేడ్ లోకి వచ్చే విధంగా ప్రయత్నం చేయవలెనని ఉపాధ్యాయులకు సూచించడం అయినది. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం రుచి చూడడమైనది. ఆహారం మెనూ ప్రకారంగా రుచికరంగా వండి ఉన్నారు.

## ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయండి

**విశాలాంధ్ర-సీతానగరం :** గుచ్చిమి గ్రామపంచాయతీలో ప్రభుత్వ మంజూరు చేసిన ఇల్లు నిర్మాణాలను సకాలంలో పూర్తిచేయాలని మండల ప్రత్యేక అధికారి కె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారంనాడు గుచ్చిమి గ్రామపంచాయతీని మండల స్థాయి అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు గూర్చి ఆరా తీశారు . గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం ఎల్ ఎన్ ప్రసాద్,డిప్యూటీ ఎంపీడీవో కుమార్ వర్మ, హౌసింగ్ ఏఈ జానకిరామ్, సర్పంచ్ ఎం .శ్రీదేవి, కో-ఆపరేటివ్ అధ్యక్షులు బూరాడ చిరంజీవి, సెక్రటరీ రమేష్, గ్రామ రెవెన్యూ అధికారి గణపతి,సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికులకు చట్టాలపై అవగాహన ఉండాలి

**రెండవ అదనపు జిల్లా జడ్జి దామోదరరావు**

**విశాలాంధ్ర-బెలగాం :** అసంఘటిత కార్మికులకు చట్టాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని రెండవ అదనపు జిల్లా జడ్జి మరియు మండల న్యాయ సేవా కమిటీ అధ్యక్షులు ఎస్. దామోదరరావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో అసంఘటిత కార్మికుల సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అసంఘటిత రంగం అనధికారిక రంగంలో ఎక్కువగా గ్రామీణ కార్మికులు, పట్టణ కార్మికులు ఉన్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాయని తెలిపారు. అసంఘటిత కార్మికులకు వివిధ చట్టాలు, పథకాలు, మరియు సామాజిక భద్రతా ప్రయోజనాల గురించి అవగాహన కల్పించేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో అసంఘటిత కార్మికుల సామాజిక భద్రతా చట్టాలు, ఈ-శ్రమ్ కార్డ్ ప్రయోజనాలు, ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్-ధన్ పెన్షన్ పథకాలు, మరియు జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ అందించే న్యాయ సలహాల అంశాలపై సమగ్రంగా కార్మికులకు అవగాహన కల్పించారు. కార్మికశాఖలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి సవివరంగా తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా జిల్లాలో ఎంతమంది కార్మికులు లబ్ధి పొందుతున్నారో ఆరా తీశారు. కార్మిక వేతన సవరణ చట్టం, హక్కులు, బాధ్యతల గురించి జడ్జి కార్మికులకు తెలియజేశారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1510 0 కు ఫోన్ చేసి న్యాయ సలహాలను పొందవచ్చని జడ్జి కార్మికులకు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమీషనర్ పి.సువర్ణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.కొండలరావు, లోక్ అదాలత్ సభ్యులు టి. జోగారావు, అప్ హెరాల్డ్ స్వచ్ఛంద సంస్థ నుండి ఎస్. సత్యనారాయణ, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనసేన అధ్యక్షుల అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

**విశాలాంధ్ర-కొమరాడ :** మండలం జనసేన పార్టీ అధ్యక్షులు అక్రమ వసూళ్ల పై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి మరడాన సింహాచలం నాయుడు అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో వైఎస్ఆర్సిపి పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తయినప్పటికీ సందర్భంగా వికలాంగులు పెన్షన్లు తొలగించడం చాలా దారుణం మని అన్నారు. ఒకవైపు వికలాంగుల పింఛన్లు తొలగిస్తూ ఉంటే మరోవైపు జనసేన పార్టీ అధ్యక్షులు కొమరాడ మండలం కుమ్మరిగుంట పంచాయతీలో పలువురు వద్ద నుంచి సదరం సర్టిఫికెట్లు చేసి పింఛన్లు మంజూరు చేస్తామంటూ ఒక్కొక్క వ్యక్తి నుండి రూ .30,000 వసూళు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. ఒకవైపు జనసేన పార్టీ వ్యవస్థాపకులు పవన్ కళ్యాణ్ నాయకులు ఎవరైనా అక్రమాల్లో పాల్పడితే వారి తాటతీస్తానని ఒకవైపు హెచ్చరిస్తుంటే మరో వైపు మండల స్థాయి అధ్యక్షులు పదవిలో ఉన్న వ్యక్తి ఇలా పేద ప్రజల నుంచి ఒక్కో సదరం సర్టిఫికెట్ కు రూ. 30 వేలు చొప్పున వసులు చేయడం చాలా దుర్మార్గపు చర్య అని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న ఒక జనసేన పార్టీ నాయకుల మాత్రమే ఇలా అక్రమంగా వసూలు చేస్తున్నారా లేక కుటమి ప్రభుత్వంలో ఉన్న అంతమంది నాయకులు వసూళ్లు చేస్తున్నారా అన్న విషయాలపై ప్రభుత్వం అధికారులు స్పందించి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. సదరం సర్టిఫికెట్లు చేసి పింఛన్లు ఇప్పిస్తామని ఆశ పెట్టడంతో కుమ్మరిగుంట పంచాయతీ చెందిన ఒక వ్యక్తి తన భార్య తాళిబొట్టును తాకట్టు పెట్టి మరి జనసేన పార్టీ మండల అధ్యక్షులకు ఇచ్చినట్లు ఒక ఆడియో రికార్డింగ్ పలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంపై వైసీపీ పార్టీ తరఫున ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇలా పలు రికార్డులు సోషల్ మీడియాలో వైరల్ కావడం అక్రమసూళ్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. తక్షణమే ప్రభుత్వం కూటమి నాయకులు ఈ విషయంపై స్పందించి అక్రమ వసులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలన్నారు. సదరం సర్టిఫికెట్ల కోసం వసూళ్లు చేసిన డబ్బును తిరిగి పేద ప్రజలకు అందజేసి వారికి అర్హులైతే ప్రభుత్వ తరపు నుచి పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో వైసీపీ పార్టీ తరఫున ఆందోళన చేస్తామని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కలింగ మల్లిబాబు, జిల్లా యువజన నాయకులు నంగి రెడ్డి శరత్ బాబు, విక్రం పురం ఉపసర్పంచ్ సిరిపురపు రామకృష్ణ, కుమ్మరిగుంట మాజీ సర్పంచ్ కెంగువ పోలినాయుడు, నాయకులు మరడాన సూరపనాయుడు, చిన్న సుధా తదితరులు ఉన్నారు.

## ప్రయాణికుల విశ్రాంతి మందిరమా... వినాయక విగ్రహాల వ్యాపార భవనమా?

- అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపమే కారణమా
- ప్రయాణికులకు ఉపయోగపడే సదుపాయాలు కల్పించండి
- స్థానికుల అభ్యర్థన

**విశాలాంధ్ర-చింతపల్లి :** ప్రయాణికుల విశ్రాంతి భవనం పేరుతో చింతపల్లి పాత బస్టాండ్ కూడలి లో నిర్మించిన బస్ షెల్టర్ ప్రయాణికులకు తప్ప సాధువులకు షెల్టర్ గాను, వినాయక విగ్రహాల వ్యాపార కూడలిగాను తయారైంది. లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్ షెల్టర్ (ప్రయాణికుల విశ్రాంతి భవనం), మరుగుదొడ్లు సౌకర్యాల లేమి, అధికారుల, ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ లోపం కారణంగా నిరుపయోగంగా మారడంతో పలువురు సాధువులు బస్ షెల్టర్ లో ఉంటూ అక్కడే మరణించిన సందర్భాలు లేకపోలేదు. బస్సులు కూడా అక్కడ నిలుపుదల చేయకపోవడంతో ప్రయాణికులు ఎవరు బస్ షెల్టర్ వద్ద ఉండేందుకు ఇష్టపడని పరిస్థితి. బస్సుల నిలుపుదల ఒకచోట, ప్రయాణికుల విశ్రాంతి మందిరం (బస్సు షెల్టర్) మరోచోట ఏర్పాటు చేయడం వలన బస్ షెల్టర్, మరుగుదొడ్లు ప్రయాణికులకు ఏ విధంగానూ ఉపయోగపడటం లేదు. దీంతో ఈ విశ్రాంతి మందిరాన్ని సాధువులు సేద తీరేందుకు ఉపయోగించుకుంటున్నారు. ఇందులో భాగంగా ఒకరిద్దరు సాధువులు ఈ బస్ షెల్టర్ లోనే మరణించారు. దీనివలన ఆ విశ్రాంతి మందిరం వద్ద ఉండేందుకు ప్రయాణికులు ఇష్టపడని పరిస్థితి. ప్రస్తుతం వినాయక చవితి పర్వదిన నేపథ్యంలో వినాయక విగ్రహాల వ్యాపారస్తులు ఈ విశ్రాంతి మందిరాన్ని (బస్ షెల్టర్ ను) వినాయక విగ్రహాల వ్యాపార మందిరంగా మార్చారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్ సెంటర్, మరుగుదొడ్లను ప్రయాణికులకు ఉపయోగపడే విధంగా సదుపాయాలు కల్పించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## ఓటర్ల జాబితా తయారీలో సహకరించండి

**విశాలాంధ్ర-పార్వతీపురం :** జిల్లాలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీలో బిఎల్ఓలకు సహకరించాలని కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి ఎస్.చిన్నారావు రాజకీయ పక్షాల ప్రతినిధులను కోరారు. ఓటరు ఒక నియోజకవర్గంలోనే నమోదై ఉండాలని, పలు చోట్ల నమోదు కారాదన్నారు. ఓటరు వేరే ప్రాంతానికి బదిలీ అయితే, తన ఓటు హక్కును కూడా బదిలీ చేసుకోవాలని స్పష్టం చేశారు. తద్వారా డూప్లికేట్ ఓటర్ల సమస్య ఉండబోదని, ఇందుకు బీఎల్ఓలు జాగ్రత్తలు పాటిస్తారని, రాజకీయ పక్షాలు తమ పరిధిలోని ఓటర్ల నమోదు ప్రక్రియలో డూప్లికేషన్ జరగకుండా తగిన సూచనలు చేయాలని అన్నారు. శనివారం డీఆర్ఓ ఛాంబరులో ఏఓ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెలా సమావేశాలు ఉంటాయని, అప్పటివరకు రాజకీయ పక్షాల దృష్టికి వచ్చిన విషయాలను డీఈఓ లేదా ఈఆర్ఓ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి నెల ఈవీఎం గోదాముల వెలుపల, త్రైమాసికంలో రాజకీయ పక్షాల సమక్షంలో గోదాముల లోపల ఈఆర్ఓ, డీఈఓ తనిఖీ చేస్తున్నట్లు వివరించారు. పోలింగ్ బూత్‌లో 800 నుంచి 1200 మంది ఓటర్లు ఉండేలా, ఓటరు నివాసం నుంచి 2కి.మీ దూరంలో పోలింగ్ కేంద్రం ఉండేలా హేతుబద్ధీకరణకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను విలీనం చేయడం/ఓటర్లను సమీప పోలింగ్ కేంద్రాలకు మార్చడం ద్వారా వివరణాత్మక కసరత్తు చేపట్టాల్సి ఉందన్నారు. కావున రాజకీయ పక్షాలు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ఆవశ్యకతను గమనించిన ప్రాంతాలను ఈఆర్ఓలు, జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను తయారు చేయడంలో బిఎల్ఓలతో సహకరించాలని అన్నారు. ఓటర్ల జాబితాలకు సంబంధించిన సూచనలు, ఓటర్ల జాబితా నాణ్యత, స్వచ్ఛతను మెరుగుపరచడానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బూత్ లెవల్ ఏజెంట్ ను నియమించాలని తెలిపారు. సవరణ కాలంలో వారు బిఎల్ఓతో అనుబంధంగా ఉంటారని అన్నారు. రాష్ట్రంలోని గుర్తింపు పొందిన 1/4 రాజకీయ పార్టీల బిఎల్ఏలతో ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించి, నిర్వహించాల్సిన దిద్దుబాట్లను గుర్తిస్తారని అన్నారు. ఎన్నికల సంఘం బూత్ లెవల్ ఏజెంట్ల ఫోటోగ్రాఫ్, మొబైల్ నంబర్‌ను చేర్చడానికి ఫారమ్ బి ఎల్ ఏ 2కు కొన్ని సవరణలు చేసిందన్నారు. బూత్ లెవల్ ఏజెంట్ల భవిష్యత్తు నియామకాలకు ఈ సవరించిన ఫారమ్ తప్పనిసరిగా ఉపయోగించ బడుతుందని నిర్ధారించు కోవాలని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పక్షాల ప్రతినిధులు జి.శివ, అల్లూరి పేర్రాజు, పైలా శ్రీనివాస రావు, వి.శ్రీనివాసరావు, ఇతర రాజకీయ పక్షాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి

**విశాలాంధ్ర-పార్వతీపురం :** జిల్లా పోలీసు కార్యాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు చిత్రపటానికి పూలమాలలువేసి, పుష్పాలువేసి నివాళులర్పించినట్లు జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధులైన ఆంధ్రకేశరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంనందుఘనంగా నిర్వహించారు. ప్రకాశంపంతులు స్వాతంత్ర్య సమరయోధునిగా, న్యాయవాదిగా, రాజకీయ వేత్తగా, రచయితగా, సంపాదకీయునిగా, రాజనీతిజ్ఞునిగా విశేషంగా రాణించి ఆంధ్ర రాష్ట్రానికి జాతీయ స్థాయిలో ఎనలేని కీర్తిని తీసుకువచ్చారన్నారు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకి కెదురుగా చొక్కాగుండీలు తీసి గుండెచూపికాల్చమని నిబ్బరంగా నిల్చి తెల్లదొరలను హడలెత్తించి ఆంధ్రకేసరి అని పేరు పొందిన మహానుభావుడు టంగుటూరి ప్రకాశం పంతులు గారని కొనియాడారు. ఆయన చేసిన సేవలకుగాను విజయవాడ నందు గల కృష్ణానదిపై ఉన్న బ్యారేజ్ కు ఆయన పేరును పెట్టడం మనందరికీ గర్వకారణమని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఎస్బి సిఐ సిహెచ్.రంగనాథం, డిసిఆర్బి సిఐ ఆదాం, ఆర్.ఐ.లు నాయుడు, రాంబాబు, శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐలు,ఎస్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు, పోలీసు కార్యాలయం, డిసిఆర్బీ,ఎస్బి, ఏఆర్, ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామంటూ ప్రతిజ్ఞ

**విశాలాంధ్ర-సీతానగరం :** కళాశాలలో పాఠశాలల పరిధిలో విద్యార్థినీ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలియజేస్తూ అందరిచేత జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి, సబ్ డివిజన్ ఏ ఎస్పీ అంకితాసురాణాలు ప్రతిజ్ఞ చేయించారు. దీనితోపాటు ఈగల్ టీం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాల్ పోస్టరులు అందరూ సమక్షంలో విడుదల చేశారు. ఈకార్యక్రమంలో సిఐ గోవిందరావు, సర్కిల్ పరిధిలో గల ఎస్సైలు రాజేష్, సింహాచలం, నీలకంతంతో పాటు ఈగల్, శక్తి టీం సభ్యులు, సుమారు 2 వేలమంది విద్యార్థులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

**ఎంపీడీవో ప్రేమ్‌సాగర్**

**విశాలాంధ్ర-దుంబ్రిగుడ :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రజల సామాజిక బాధ్యత అని మండల అభివృద్ధి శాఖ అధికారి ప్రేమ్ సాగర్ అన్నారు. మండల కేంద్రంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం నుంచి అరకు పాడేరు ప్రధాన రహదారి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేపట్టి మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రత, స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. ప్రతి మూడవ శనివారం స్వచ్ఛంద స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు కృషి చేస్తున్నమని చెప్పారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ త్రివేణి,మండల విద్యాశాఖ అధికారి సుందర్రావు, సచివాలయం సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు జనవిజ్ఞాన వేదిక పార్వతీపురం మన్యం జిల్లా మహాసభ

**విశాలాంధ్ర-బెలగాం :** పార్వతీపురం జిల్లా కేంద్రం శివారులో గల జట్టు ఆశ్రమంలో జనవిజ్ఞాన వేదిక పార్వతీపురం మన్యం జిల్లా మహాసభ 24వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహించబడునని జనవిజ్ఞాన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండవల్లి గౌరునాయుడు, సార్తి మహేశ్వరరావు తెలిపారు. సమావేశంలో గత ఏడాది కార్యక్రమాలపై సమీక్ష, కార్యదర్శి నివేదిక నూతన కార్యవర్గ ఎన్నిక, భవిష్యత్తు కర్తవ్యాలు ఎజెండాగా ఉంటాయని వారు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు, కార్యకర్తలు, సైన్స్ అభిమానులు, పర్యావరణ ప్రేమికులు ఈ మహాసభకు హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

## ఆరోగ్యానికి పరిశుభ్రత అవసరం

**డిఆర్‌డిఏ పిడి సుధారాణి**

**విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ :** ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలంటే పౌష్టికాహారంతో పాటు మంచి వాతావరణంలో జీవించాలని డిఆర్డిఏ పిడి సుధారాణి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని నర్సిపురం మేజర్ పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె గ్రామానికి చెందిన వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గొట్టాపు గౌరీ తో కలిసి గ్రామమంతా తిరుగుతూ పారిశుధ్యాన్ని పరిశీలించారు. గ్రామంలోని సచివాలయం నుంచి పలు వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించి పారిశుధ్యము ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. గృహ ఉపకరణాల నుంచి ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను ఆరుబయట కాలువల్లో పారబోయకుండా పారిశుధ్య కార్మికులకు తడి చెత్త పొడి చెత్తగా వేరు చేసి ఇవ్వాలని సూచించారు అపరిశుభ్ర వాతావరణ మూలంగానే అనేక రోగాల ప్రజల అవకాశం ఉందని ప్రజలు పారిశుధ్య మెరుగుకు సహకరించాలని పిలుపునిచ్చారు. చైర్మన్ గొట్టాపు గౌరీ మాట్లాడుతూ ప్రభుత్వం పారిశుద్ధ్య మెరుపు కోసం కూటమి ప్రభుత్వం చెత్తశుద్ధిగా ఉందని ప్రజలకు రోగాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు వారిలో అవగాహన తీసుకొస్తుందని అన్నారు .ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సురేష్ తో పాటు ఎంపీడీవో రమేష్ వెలుగు ఏపిఎం సన్నీ బాబు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించాలి

**విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్:** జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించాలని సిపిఐ (ఎమ్ఎల్) రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి తోట. జీవన్ అన్నారు.మన్యం జిల్లా సమగ్రాభివృద్ధికై సీపీఐ (ఎంఎల్) రెడ్ స్టార్ నిరంతరం ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. జిల్లా కార్యవర్గ సమావేశం అరినాన సీతమ్మ అధ్యక్షతన జరిగింది.తోటపల్లి కుడి, ఎడమ కాలువలు, పెద్దగడ్డ, జంపర్లకోట ప్రాజెక్టులు పూర్తిచేసి చివర వరకు నీరు అందించాలి, జంఝావతి ప్రాజెక్టు సంబంధించి(ఆంధ్ర -ఒరిస్సా ప్రభుత్వాలు చర్చించి) సమస్యను పరిష్కారం చేయాలన్నారు.జిల్లాలో విస్తారంగా ఉన్న గెడ్డలు, వాగులుపై చెక్ డాములు నిర్మించి సాగునీరు అందించాలన్నారు.పూర్ణ పాడు- లాబేసు వంతెనను సత్వరమే పూర్తి చేయాలని, లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి, కార్మికులకు, రైతులకు బకాయిలు చెల్లించాలి, జీడి, పసుపు,జొన్న ప్రాసెసింగ్ చేసే కంపెనీలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని వరుసగా మూడు సంవత్సరాల నుండి నష్టపోయిన జీడి రైతులకు నష్ట పరిహారం అందించాలన్నారు.వరి, మొక్కజొన్న, అరటి, పత్తి, పసుపు తదితర పంటలకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలనీగిరిశికర గ్రామాలకు రక్షిత మంచినీరు కల్పించాలి, అధ్వానంగా ఉన్న రోడ్లను వెంటనే వేయాలనీ,ఏనుగులు తరచూ జిల్లాలో చంచరిస్తున్నాయి, వాటికి సంబంధించి శాశ్వత పరిష్కారం చూపాలి, వాటి వల్ల నష్టపోయిన వారికి పంట నష్ట పరిహారం చెల్లించాలన్నారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు ఒక్కో నియోజకవర్గానికి సంవత్సరానికి 20 కోట్లు కేటాయించాలి, అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, బొత్స మోహన్ రావు, గుజ్జ జనార్దన్, బిడ్డక రామ్మూర్తి పత్తిక మోహన్ రావు, మండంగి సింగన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకలు ఆసుపత్రిగా పొడిగింపు

**బిజెపి నాయకులు హర్షం**

**విశాలాంధ్ర-చింతూరు :** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్‌లోని చింతూరు ఏరియా హాస్పిటల్‌ను 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినందుకు బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ను కలసి వినతి పత్రాలు అందజేయడం జరిగింది. మారుమూల గ్రామాలకు మెరుగైన వైద్యసదుపాయాలు అందించాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా గుర్తించి మంజూరు చేయడం జరిగింది. ఈ క్రమంలో గౌరవ ఎమ్మెల్యే శ్రీమతి మిరియాల శిరీష దేవి గారి కృషి అమూల్యమని నాయకులు పేర్కొన్నారు. ఈ ఆసుపత్రి ఏర్పాటుతో చింతూరు సహా నాలుగు మండలాల ప్రజలకు మాత్రమే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల గిరిజనులు, ప్రజలకు అత్యవసర సమయాల్లో వైద్యసదుపాయాలు అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కు, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి కి బిజెపి ముఖ్య నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి అల్లూరి సీతారామరాజు జిల్లా మాజీ కార్యదర్శి పాయం వెంకయ్య, చింతూరు బిజెపి మాజీ మండల అధ్యక్షుడు డి.వి.ఎస్. రమణారెడ్డి, కట్టం ముత్తయ్య, కోట్ల వెంకన్న, జారె బొజ్జమ్మ, సోడే గంగమ్మ,ముటా మల్లేష్, శ్యామల లక్ష్మణరావు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

**విశాలాంధ్ర-చింతూరు :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ఇన్ ఛార్జి ప్రిన్సిపాల్ జి.వెంకట్రావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చంద్రయాన్-3 ఆగస్టు 23 న 2023 విజయవంతం అయ్యినందున ప్రతి సంవత్సరం ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపబడుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయ్ అంతరిక్ష పరిశోధనకు ఎంతగానో కృషి చేసిన వ్యక్తియని, చంద్రయాన్ -3 చంద్రుని దక్షిణ ధ్రువంపై విజయవంతం మొట్టమొదటిగా భారతదేశం కాలు మోపిందిగా కొనియాడారు. మన భారతదేశం తరపున అంతరిక్షంలోకి వెళ్లిన రెండవ వ్యక్తి శుభాంశుక్ల జూన్ 26న వెళ్లి మరల తిరిగి జులై 15న తిరిగి వచ్చారని, ఈ సంవత్సరం థీమ్ : ఆర్యభట్ట నుండి గగన్ యాన్ : ప్రాచీన జ్ఞానం నుండి అనంతమైన అవకాశాల వరకు అని పేర్కొన్నారు. రాజనీతి శాస్త్ర విభాగాదిపతి ఎస్. అప్పనమ్మ మాట్లాడుతూ 1969 లో విక్రమ్ సారాభాయ్ ద్వారా ఇస్రోని స్థాపించారని, ఆయన ఇండియాకు తిరిగి వచ్చినప్పుడు ప్రభుత్వం ద్వారా నిధులను సమకూర్చి ఇస్రోని ఏర్పాటు చేశారని, ఇస్రో ద్వారా 2040 సంవత్సరం నాటికి అంతరిక్షంలో మానవ సహిత రాకెట్స్‌ను పంపించేందుకు సన్నాహాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు చేరువగా అధునాతన వైద్యం

**ఉచిత గుండె వైద్య శిబిరాన్ని డిఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు పరిశీలన**

**విశాలాంధ్ర-బెలగాం :** పిల్లల మెరుగైన ఆరోగ్యం కోసం వైద్యారోగ్యశాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు పేర్కొన్నారు. ఎన్.హెచ్ఎం & ఆర్.బి.ఎస్.కె ప్రోగ్రాంలో బాగంగా జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రంలో శనివారం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. విశాఖపట్నం మెడికవర్ హాస్పిటల్స్ నుండి విచ్చేసిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎ. అశోక్ రాజు ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. గుండె సంబంధిత సమస్యలతో జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి కేంద్రానికి తీసుకువచ్చిన 18ఏళ్ల లోపు బాలలకు ఆయన 2డి ఇఖో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ అక్కడ వారి ఆరోగ్య పరీక్షల వివరాలు, ఆరోగ్య స్థితిగతులపై వైద్యుణ్ణి అడిగి తెలుసుకున్నారు. మొత్తం 26 మందికి పరీక్షలు నిర్వహించగా వారిలో నలుగురికి శస్త్ర చికిత్సలు, ముగ్గురికి కార్డియాక్ ఇంటర్వెన్షన్ కొరకు మొత్తం ఏడుగురు బాలలను మెడికవర్ ఆసుపత్రి రిఫర్ చేస్తున్నామని వీరికి ఎన్టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్.బి.ఎస్.కె అధికారి డాక్టర్ టి. జగన్‌మోహనరావు, డిపిఎంఓ డా రఘుకుమార్, డిఇఐసి పిల్లల వైద్య నిపుణులు డా.భరత్ చంద్ర, ఎపిడిమియాలజిస్ట్ డా కౌశిక్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కుల, మత రాజకీయాలు చేసి రాణించిన పార్టీలు చరిత్రలో లేవు

**వైకాపా ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్**

**విశాలాంధ్ర-చింతపల్లి :** కుల, మత రాజకీయాలు చేసి రాణించిన పార్టీలుగానీ, వ్యక్తులు గానీ చరిత్రలో లేవని వైకాపా గిరిజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లీ సుధాకర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో ఎన్ని రకాల కుల రాజకీయాలు చేసినా వైకాపాను ఢీకొనే సత్తా ఎవరికి లేదన్నారు. కుల మత రాజకీయాలు చేయడం వలన రాణించిన దాఖలాలు చరిత్రలో కనీ విని ఎరుగలేదన్నారు. రాజకీయంగా ఎదగాలంటే కచ్చితంగా అన్ని సామాజిక వర్గాలను కలుపుకొని ముందుకు వెళ్లాలన్నారు. అందరినీ కలుపుకుని వెళ్లిన నాడే రాజకీయంగాను, ప్రజా ప్రతినిధులుగానూ రాణించి ప్రజలకు సేవ చేయగలిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం సామాజిక వర్గ పరిస్థితులు బహిరంగ రాజకీయాలకు దారితీస్తున్నాయని, గతంతో పోల్చుకుంటే రాజకీయ పనితనం, వ్యక్తిత్వం, పార్టీ యొక్క స్థితిగతులు, విధివిధానాల వల్ల కుల, మతాలకతీతంగా ఎందరో ప్రజా ప్రతినిధులు అయ్యారని ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా ఈ ప్రాంతాన్ని పాలించారని, ఇప్పుడు సామాజిక వర్గాలంటూ బహిరంగ సమావేశాలు నిర్వహిస్తూ కుల చిచ్చు రేపుతున్నారని, దీని వలన జాతి వివక్షత ఏర్పడి రిజర్వేషన్లు కూడా కోల్పోయే ప్రమాదం చోటుచేసుకుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇంతవరకు ఉమ్మడి విశాఖ ఏజెన్సీలో ఆరోగ్యకరమైన రాజకీయాలు ఉన్నాయని, నేడు కొందరు స్వార్థపరులు ఆ రాజకీయాలను కలుషితం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే కులం, ఒకే మతం, ఒకే రాజకీయం అనే విధానం ఎక్కడా చూడలేదని, నేడు ఆ పరిస్థితి మన్య ప్రాంతంలో కనిపించడం ఆందోళన కలిగిస్తుందన్నారు. కలిసి ఉంటే కలదు సుఖం అనే నినాదంతో ప్రజలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రతినిధులు ముందుకు వెళ్తున్నారని, కుల ప్రస్తావన లేని మతప్రస్తావన లేని రాజకీయాలు ఏజెన్సీలో కొనసాగితే అందరికీ మంచిదని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

## అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర

విశాలాంధ్ర-చింతూరు : చింతూరు అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ క్యాంపస్ లో స్వచ్చంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. అడిషనల్ ఎస్పీ కార్యాలయం, పోలీస్ స్టేషన్ ఆవరణంలో పెరిగిన మొక్కలను శుభ్రం చేశారు. ముళ్ళ పొదలను తీసివేశారు. ఈ కార్యక్రమంలో, స్థానిక పోలీస్ సిబ్బంది, ఏఎస్ఎస్ పార్టీ, సి ఆర్ పి ఎఫ్ సిబ్బందితోపాటు సీఐ గోపాల కృష్ణ, ఎస్ఐ పి రమేష్, ఏఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'సంకల్పం' పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహణ

- విద్యార్థినీ, విద్యార్థులు సన్మార్గంలో ఉండి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి
- డ్రగ్స్ బారినపడి యువత నష్టపోవద్దు
- డ్రగ్స్, మహిళల రక్షణపై 1972కు కాల్ చేయండి
- సైబర్ క్రైమ్ జరిగితే 1930కు కాల్ చేయండి
- ప్రమాదాలు జరిగితే 100కు కాల్ చేయండి
- యువతకు అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈగల్ టీం, శక్తి టీంలు
- ముఖ్యఅతిథులుగా పాల్గొన్న జిల్లా ఎస్పీ మాధవ్‌రెడ్డి, సబ్ డివిజన్ ఏఎస్పీ అంకిత సురానలు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని జోగంపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం ఆవరణలో శనివారంనాడు పార్వతీపురం మన్యంజిల్లాఎస్పీ మాధవ్ రెడ్డి ఆధ్వర్యంలో సంకల్పం పేరిట డ్రగ్స్ మరియు మహిళల రక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి, పార్వతీపురం సబ్ డివిజన్ ఏఎస్పీ అంకిత సురానలు పాల్గొని అమూల్యమైన సందేశాన్ని వివరించారు. పాఠశాలలో కళాశాలలో చదువుతున్న యువత చెడు వ్యసనాలకు బానిసకావద్దని, సన్మార్గంలో ఉండి ఉన్నత స్థానాలకు చేరుకునే విధంగా చదువుకోవాలని తెలిపారు. నేటి యువత రేపటి బావి భారత పౌరులని, సన్మార్గంలో ఉండి క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థానాలకు చేరుకోవడం చాలా సులభం అన్నారు. ఇటీవల కాలంలో పాఠశాల కళాశాల స్థాయిలో డ్రగ్స్ బారిన యువత పడుతున్నారన్న ముందస్తు సమాచారంతో సంకల్పం పేరిట విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖ, వైద్యశాఖ, అంగన్వాడి, పోలీస్ శాఖల సంయుక్త సహకారంతో సంకల్పం కార్యక్రమాలను జిల్లాలో నిర్వహిస్తూ విద్యార్థినీ విద్యార్థులలో అవగాహగణ కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో శక్తిటీం, ఈగల్ టీంలు ఏర్పాటుచేసి వారి ఆధ్వర్యంలో కూడా జిల్లాలో పెద్దఎత్తున పాఠశాలల్లో కళాశాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించి యువతను సన్మార్గంలో ఉంచేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తుందన్నారు. అప్పట్లో మేము చదువుకునే రోజుల్లో మాకు శత్రువురోజుల్లో మాకు శత్రువులు, మిత్రులు లేరని ఉపాధ్యాయుల చేయూతతో నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నామని తెలిపారు. కానీ ఇప్పుడు మాత్రం మన దగ్గర శత్రువులు ఇంటర్ నెట్, గూగుల్, క్రోమ్ ఉంటివి ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే మంచి జరుగుతుందని, దుర్వినియోగంచేస్తే జీవితాలు దయనీయంగా ఉంటాయని తెలిపారు. అప్పట్లో డబ్బులు చాలా తక్కువగా ఉండేవని, డబ్బులు నగదు రూపంలో ఉండి వాడుకలో ఉండగా నేడు ప్రతి ఒక్కరూ గూగుల్ పే, ఫోన్ పే విదానం ద్వారా ఖర్చులు చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందేనని, ఇటువంటి సమయములో సైబర్ క్రైమ్ పెరుగుతుందని తెలిపారు. ఇటీవల కాలంలో సైబర్ క్రైమ్, ఇంటర్నెట్ యువత చూడడం వల్ల జరిగే దుష్పరిణామాలు గూర్చి వివరించారు. పాఠశాలల్లో కళాశాలలో అసాంఘిక కార్యక్రమాలు జరిగితే 1972కు ఫోన్ చేయాలని, సైబర్ నేరాలు జరిగితే 1930కు కాల్ చేయాలని, ఏదైన సమాచారం చేరవేయాలంటే 100కు డయల్ చేయాలని తెలిపారు. మరిపి వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి పల్లవి, జోగంపేట ప్రతిభ పాఠశాల విద్యార్థి వి.చైతన్యలు నేడు జరుగుతున్న డ్రగ్స్, మహిళలపై దాడులను గూర్చి వివరిస్తూ, వాటి నివారణ మార్గాలను కూడా తెలియజేసి జిల్లా ఎస్పీ, ఏఎస్పీల చేత ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి యేటూరి నాగేశ్వరరావు, డిసిపిఓ సత్యనారాయణ, మండల విద్యాశాఖ అధికారి సూరిదేముడు, సీతానగరం వైద్యులు పి ఉషారాణి, కళాశాల ప్రిన్సిపాల్ రాజారావు, పార్వతీపురం సిఐ గోవిందరావు సీతానగరం ఎస్ఐ రాజేష్, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు సుధాలు మాట్లాడారు. ఈకార్యక్రమంలో సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దాలినాయుడు, ఎంఈఓ 2 వెంకటరమణ, బలిజీపేట ఎస్సై సింహాచలం, కొమరాడ ఎస్సై నీలకంఠం, సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, నిడగల్లు, మరిపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, జోగంపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థులు, ప్రతిభ జూనియర్ కళాశాల, ప్రతిభ పాఠశాల విద్యార్థులు, కేజీబీవీ విద్యార్థులు, ఆయా పాఠశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయ సిబ్బంది, జిల్లాలోని ఈగల్ టీం, శక్తిటీంల పోలీస్ సిబ్బంది, సీతానగరం పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతముగా నిర్వహించ డంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న సీతానగరం ఎస్సై రాజేష్, సీతానగరం పోలీస్ శాఖ సిబ్బందిని ఎస్పీ మాధవ్ రెడ్డి , ఏఎస్పీ అంకిత సురానలు అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డికు, ఏ ఎస్పి అంకిత సురానలకు సీతానగరం పోలీస్ శాఖ తరపున మెమొంటోలు అధికారులు అందజేశారు. ఈకార్యక్రమంలో 1500మంది విద్యార్థినీ, విద్యార్థులతోపాటు మండలంలోని సచివాలయాల పరిధిలోని ఎంఎస్పీలు కూడా పాల్గొన్నారు.

## విజయవంతంగా 'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్' కార్యక్రమం

విశాలాంధ్ర-చింతపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమంను విజయవంతం చేసేందుకు అందరూ కలిసి రావడం సంతోషకరమని స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి సిహెచ్ సీతామహాలక్ష్మి అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా చేపట్టిన "స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్య క్రమం ప్రతి నెల 3 వ శనివారం జరుగుతున్న విషయం తెలిసిందే. కాగా 3 వ శనివారం జరగాల్సిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమం అనివార్య కారణాల వలన 4 వ శనివారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 23 న నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతామహాలక్ష్మి మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమం జయప్రదానికి ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా బాధ్యత తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం వలన ఏ ఒక్కరికో ప్రమాదం సంభవించదని, ప్రతి ఒక్కరిపై దాని ప్రభావం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత ఎంత ముఖ్యమో, పరిసరాల పరిశుభ్రత కూడా అంతే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల కో ఆప్సన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, మండల విద్యాశాఖ అధికారి పనసల ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి టి మధుసూదన్, గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈ గడుతూరి స్వర్ణలత, ఏపీ గురుకుల కళాశాల ప్రధానాచార్యుడు రామేశ్వరం, స్థానిక పంచాయతీ కార్యదర్శి లక్ష్మి కుమార్, కూటమి పార్టీలకు చెందిన బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కదుల్ల శ్రీనివాస్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు సాగిన బాలకృష్ణ, జిల్లా ఐటీ కన్వీనర్ పండా ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సాగిన నరేంద్ర ప్రసాద్, యువ మోర్చా మండల అధ్యక్షుడు దేపూరు సోమలింగం, గిరిజన మోర్చా అధ్యక్షుడు ఒంటరి చిన్నారావు, జిల్లా మైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి సోమేష్, మండల కార్యదర్శి మాతే లక్ష్మణరావు, జనసేన మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు, సుర్ల వీరేంద్ర కుమార్, తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆనందరావు, మైనార్టీ విభాగం నాయకుడు షేక్ ఖాసిం వల్లి, వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, అధిక సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతూరు : పరిసరాల పరిశుభ్రత మనిషి ఆరోగ్యానికి సోపానం అని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకెసి ట్రస్ట్ చైర్మన్ టిడిపి మండల అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ తెలిపారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రభుత్వ అధికారులు ఎస్టీ కాలనీ లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడి కేంద్రం వద్ద దోమ లార్వాలను పిచికారి కార్యక్రమం నిర్వహించి అనంతరం వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుందం శ్రీనివాస్ దొర, జమాల్ ఖాన్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరమని అప్పుడే ఆరోగ్యకరమైన వాతావరణం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. వీధుల్లో మురికి నీరు త్రాగునీరు కలుషితం లేకుండా చూడాలని త్రాగునీరు వర్షాకాలంలో అధిక మొత్తంలో కలుషితం అయ్యే అవకాశం ఉన్నందున వేడి చేసి చల్లార్చి వడపోసి త్రాగటం వలన చాలావరకు ఆరోగ్య సమస్యల నుండి బయటపడవచ్చు అన్నారు. ఆరోగ్యం కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలని ప్రతిజ్ఞ చేశారు.అనంతరం ఏజిహెచ్ఎస్ ఎస్ఎంఎస్ హాస్టల్ వద్ద మురికినీరు కాలువల్లో ఆయిల్ బాల్స్ లను వేయడం జరిగింది దీనివలన దోమల లార్వాలు వృద్ధి కాకుండా అడ్డుకుంటాయని ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో కిరోసిన్ లేదా వ్యర్థ ఆయిల్ ను చల్లుకోవాలని దాని వలన ప్రమాదకర దోమలు అంతరించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ పుల్లయ్య, ఐ సి డి ఎస్ సిడిపిఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి గంగరాజు, సావిడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అహ్మద్ అలీ. మార్కెట్ కమిటీ సభ్యుడు సాల్మన్ రాజు, మాజీ మండల అధ్యక్షులు ఇల్లా చిన్నారెడ్డి, ఓబుళ్ల నేని నరసింహారావు, యస్ ఏ ఆసిఫ్, పొదిలి రామారావు, సురేష్ చౌదరి, ముత్యాల శ్రీరామ్, కూటమి నాయకులు చిట్టిబాబు, మడివి రాజు, ఆశ వర్కర్లు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జికే వీధి : గూడెం కొత్తవీధి మండలం పంచాయతీ కేంద్రంలో స్వచ్ఛభారత్ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత పై డిప్యూటీ ఎంపీడీవో మహేష్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పోత్తూరు కొండలరావు హాజరయ్యారు. అనంతరం మానవహారంగా ఏర్పడి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అలాగే చామగెడ్డ గ్రామంలో త్రాగునీరు సమస్య తలెత్తడంతో డిప్యూటీ ఎంపీడీవో, ఆర్డబ్ల్యూజేఈ, టిడిపి మండల అధ్యక్షులు ఆ గ్రామానికి సందర్శించి, చామగెడ్డ గ్రామస్తులతో మాట్లాడి త్రాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా ఆలోచన చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు టిడిపి మండల అధ్యక్షులు కొత్తూరు కొండలరావు, జనసేన పార్టీ పంచాయతీ అధ్యక్షులు కూడా మధు కుమార్, గుండ్ల వంశి, ఆర్ డబ్ల్యు జే ఈ కళ్యాణ్ రామ్, పంచాయతీ సెక్రెటరీ శివ, అంగన్వాడి, ఆశ కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, మహిళలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : మండలంలోని బిత్రపాడు చింతల బెలగాం పంచాయతీలలో మండల ప్రత్యేక అధికారి కొండలరావు ఎంపీడీవో కర్రి ధర్మారావు ఆధ్వర్యంలో స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు ముందుగా గ్రామంలో పర్యటించిన ఆయన పారిశుద్ధ్యం పై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ కార్యక్రమంపై ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నెలలో మూడవ శనివారం పారిశుధ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ మీ పరిసరాలలో ఉన్న తడి పొడి చెత్తలను వేరువేరుగా మీ గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్ల సేవలను వినియోగించుకొవాలని ప్రస్తుత వర్షాకాలం కావడంతో కాలువలు, మురుగుకుంటలు, పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు , ఆసుపత్రి,అన్ని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలలో పారిశుధ్యం మెరుగుకై అందరూ కలసి పనిచేయాలని ఆయన అన్నారు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ జగదీష్ ఎంపీటీసీ సభ్యులు శంకరరావు ఆశ వర్కర్లులు అంగన్వాడీ సిబ్బందితో ర్యాలీ నిర్వహించడం జరిగింది.

వి.ఆర్.పురం. : ప్రతీ నెల మూడవ శనివారం నిర్వహించు (స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర) కార్యక్రమం మండలంలోనీ ధర్మతాల్లగూడెం గ్రామంలో శనివారం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా అదనపు ప్రాజెక్టు అధికారి ఐటిడి ఏచింతూరు వారు మాట్లాడుతూ, వరదలు వచ్చి తగ్గుతున్న సమయంలో పరిసరాలు శుభ్రముగా లేకపోతే రోగాలు సంక్రమించే అవకాశం ఉన్నందున ముంపు గ్రామాలలొ బ్లీచింగ్, క్లీనింగ్, క్లోరినేషన్, ఫాగ్గింగ్ చేపించుట జరుగుతుందన్నారు. పిహెచ్సి డాక్టర్ అనిల్ మాట్లాడుతూ అంటువ్యాధులు వచ్చు సమయము తగు జాగ్రత్తలు తీసుకోవలసిందిగా కోరటం జరిగింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.ఇమ్మానుయేల్ మాట్లాడుతూ ముంపు గ్రామాలలొ బ్లీచింగ్, క్లీనింగ్, క్లోరినేషన్, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేపించుట జరిగిందని తెలుపుతూ ఈ వరదలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.అనంతరం ధర్మతాళ్ళగూడెం ఎంపీపీ స్కూల్ ని సందర్శించి పిల్లలతో శానిటైజేషను గురించి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ కారం లక్ష్మీ మాట్లాడుతూ వరద ముంపు బాధితులకు నిత్యవసర సరుకులు దోమతెరలు రగ్గులు ఇతరములు ఇప్పించవలసిందిగా అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమములో ఎంఈఓ సిహెచ్ బాబురావు, ఆర్డబ్ల్యూఎస్ ఈ హౌసింగ్ ఏ ఈ, సిడిపిఓ, వెటర్నరీ డాక్టర్, వెలుగు ఏపీఎం వైద్య సిబ్బంది, పంచాయత్ కార్యదర్శి సచివాలయ సిబ్బంది సర్పంచ్ సోడే నర్సమ్మ పీసాకమిటీ ఉపాధ్యక్షులు సున్నం రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కార్మిక సమస్యలపై ఉధృత పోరాటానికి సిద్ధం

**-సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు**

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : రానున్న రోజుల్లో కార్మిక సమస్యలపై ఉధృతమైన పోరాటాలు నిర్వహించాలని అందుకు కార్మికులు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని శనివారం సిఐటియు మండల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా కార్మిక సమస్యలు పరిష్కారం కై అల్లూరి జిల్లాలో కార్మిక వర్గానికి ఐక్యం చేసి అనేక సమస్యలపై సిఐటియు రాజి లేని పోరాటాలు చేసిందని తెలిపారు. కార్మికులకు అండగా సిఐటియు ఉంటుందని చెప్పారు. అంగన్వాడి, ఆశ, ఐకెపి వివోఏ వంటి సమస్యలపై పోరాటాలు చేసామన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు పథకం ఉద్దేశం మంచిదైన ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్ల పరిస్థితులు దారుణంగా మారిందని చెప్పారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దుచేసి కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని ఈ చట్టాలు అమలు జరిగితే కార్మికులు బానిసలుగా బతకాల్సి వస్తుందని చెప్పారు. కార్మికుల శ్రమను దోచుకునేందుకు ప్రైవేట్ సంస్థలు బడా పెట్టుబడిదారులు ప్రయోజనాలు చేకూరే విధంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చట్టల్లో మార్పులు తీసుకొస్తుందని అందుకు కేంద్రం పై పెద్ద ఎత్తున ప్రతిఘటన ఉద్యమం చేయాలని తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరణ చేస్తున్నారని దీంతో ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్లు ఉండవని నిరుద్యోగ సమస్య మరింతగా పెరిగే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పోతురాజు, జిల్లా ఉపాధ్యక్షులు బాగ్రతం. భాస్కర్, సత్యవతి, పవిత్ర, కన్నమ్మ, అంగన్వాడి, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల 3వ మహాసభ

విశాలాంధ్ర -అరకులోయ: అరకులోయ మండలంలోని గిరిజన సంఘం భవనంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా 3వ మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభకి వివిధ గ్రామాల నుంచి మహిళా ప్రతినిధులు హాజరు కాగా, ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన జి.భాగ్యవతి అస్సాం బ్యాంక్ డైరెక్టర్ మాట్లాడుతూ స్వతంత్రం సిద్ధించి నేటికి 79 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న స్త్రీ ఎప్పటికీ సమాజంలో అణిచివేతకు గురవుతుందన్నారు. స్త్రీలు ఎప్పుడైతే అర్ధరాత్రి నడిరోడ్డుపై నడుస్తారో అప్పుడే దేశానికి సంపూర్ణ స్వతంత్రం వచ్చినట్టు అన్న ఆనాటి గాంధీ అన్న మాటలు ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. ఈనాటికి దేశంలో రాష్ట్రంలో స్త్రీలపై కొనసాగుతున్న దాడులు పై ఆమె తీవ్రంగా వ్యతిరేకించి ఖండించారు. అలాగే ప్రతి ఆడపిల్ల సంపూర్ణ విద్య అవలంబించాలి స్వతంత్రంగా వాళ్ళ కాళ్ళ పై వాళ్లు నిలబడేలాగా ఉద్యోగాలు చేస్తూ ముందుకు వెళ్లాలని ఆమె సూచించారు. ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు వి. వి జయ మాట్లాడుతూ దేశంలో ఐద్వా ప్రజాస్వామ్యం సమానత్వం స్త్రీ విముక్తికై లక్ష్యంతో ఐద్వా పనిచేస్తుందన్నారు. దేశంలో నానాటికి పెరుగుతున్న మద్యాన్ని అరికట్టాలని, స్త్రీలపై జరిగే అత్యాచారాలు, కుల దృహంకార హత్యలు అరికట్టే విధంగా నిందితులకు కఠిన శిక్షలు విధించాలా చట్టంలో మార్పు తీసుకురావాలని ఆమె డిమాండ్ చేస్తూ అందుకు ఐద్వా పనిచేస్తుందన్నారు. మహిళలకు పని ప్రదేశాలు లైంగిక వేధింపులు అరికట్టాలని, ఉద్యోగ భద్రత కనీస వేతనాలు సమాన పనికి సమాన వేతనం పురుషులతో సమానంగా స్త్రీలకు గౌరవం ఇవ్వాలనీ ఉద్దేశంతో ఈ మహాసభ లో కర్తవ్యం తీసుకుని ముందుకు వెళుతుందన్నారు.అలాగే మహాసభ ప్రారంభంలో దేశం, రాష్ట్రం, జిల్లా, మండలం చనిపోయిన అనేక మహిళ నాయకులకు నివాళ్లు అర్పించడం జరిగింది అలాగే కార్యదర్శి గత కార్యక్రమాల సమీక్ష మండలంలో అభివృద్ధిపై రిపోర్ట్ ప్రవేశ పెట్టడం జరిగింది అనంతరం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది మండల కమిటీ అధ్యక్షులుగా గెమ్మెలి .సుమిత్ర, మండల కార్యదర్శిగా కిలో. శశికళ అలాగే ఎనిమిది మంది కార్యదర్శి వర్గ సభ్యులు తో కూడిన నూతన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అప్పుడు సైనికుడు... ఇప్పుడు భోదకుడు

**- డీఎస్సీలో మాజీ సైనిక ఉద్యోగుల కోటాలో ఉమ్మడి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన పెదబుడ్డిడి యువకుడు**

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని పెదబుడ్డిడి గ్రామానికి చెందిన మంతిని శ్రీనివాసరావు మెగా డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికై, సత్తా చాటాడు. మొత్తం 77 మార్కులతో సాంఘిక శాస్త్ర విభాగంలో ఉమ్మడి విజయనగరం జిల్లా స్థాయి జనరల్ కేటగిరిలో 35వ ర్యాంకు, మాజీ సైనిక ఉద్యోగుల కోటాలో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి.. ఉపాధ్యాయ వృత్తికి ఎంపికయ్యాడు. యుక్త వయస్సులోనే తండ్రి మంతిని సీతారాం మరణించినా, పేదరికాన్ని ఎదిరించి. తల్లి మంతిని బానమ్మ వ్యవసాయ పనులు చేసుకుంటూ ఆమె స్ఫూర్తితో 18 ఏళ్ల వయస్సులోనే 2003లో ఆర్మీలో అడుగు పెట్టాడు. కఠినమైన కశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్, గుజరాత్‌లోని జలంధర్, అరుణాచల్‌ప్రదేశ్ సహా దేశంలో వివిధ హెూదాల్లో పని చేసి, 2020లో ఉద్యోగ పదవీ విరమణ పొందారు. సోదరుడు మంతిని పారినాయుడు సైతం అన్నయ్య స్ఫూర్తితో సైన్యంలోనే చేరాడు. ఉద్యోగ విరమణ అనంతరం ఒకవైపు గ్రామంలో విద్య, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడంతోపాటు తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం సరస్వతీ దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఉపాధ్యాయ వృత్తిపై తన మక్కువను చాటుకున్నారు. నిరంతర సాధన, పట్టుదలతో సైనికుడి నుంచి ఉపాధ్యాయుడిగా శ్రీనివాసరావు ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేసి, అభినందనలు తెలియజేశారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు

విశాలాంధ్ర-గంగవరం : శనివారం రోడ్డు పక్కన బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన ముగ్గురిపై (ఓపెన్ డ్రింకింగ్) కేసులు నమోదు చేసి, వారిని జెయఫ్‌సియమ్ కోర్టు, రంపచోడవరం ఎదుట హాజరుపరచగా వారికి రూ.3,600/- జరిమానా విధించబడింది. అదేవిధంగా, ముఖ్యమైన ప్రదేశాల్లో వాహనాల తనిఖీలు నిర్వహించగా, ఓవర్ స్పీడ్, హెల్మెట్ ధరించకపోవడం, ముఖ్యమైన డాక్యుమెంట్లు లేకపోవడం వంటి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చలానాలు విధించబడినవి. ఆగస్టు నెలలో ఇప్పటి వరకు 52 ఈ -చలానాలు విధించి, మొత్తం రూ.45,200/- జరిమానా వసూలు చేయబడింది. ఆటో యూనియన్ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించబడింది. ముఖ్యంగా గోల్డెన్ అవర్ కాన్సెప్ట్ ప్రమాదం జరిగిన తరువాత మొదటి గంట ప్రాధాన్యతను వివరించడం జరిగింది. గ్రామాలలో చిన్న అడ్డపల్లి, పెద్ద అడ్డపల్లి, జడేరు, పంద్రప్రోలు, నెల్లిపూడి, కొత్తాడ లక్కొండ, చిన్నగార్లపాడు, పెద్దగార్లపాడు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి లిరోడ్డు యాక్సిడెంట్లు నివారణలి గురించి వివరించడం జరిగినది. సాయంత్ర, రాత్రి వేళల్లో ముఖ్య రహదారులపై లిడ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలులి నిర్వహించి, వాహనదారులను హెచ్చరించి, కేసులు నమోదు చేయడం జరుగుతుంది.

## బివికే పాఠశాలలో విద్యార్థిని విద్యార్థుల ఎస్‌పిఎల్, ఏఎస్‌పిఎల్ ఎన్నిక

**ఎస్‌పిఎల్‌గా ఆర్య వర్ధన్, ఏఎస్‌పిఎల్‌గా పూజిత ఎన్నిక**

విశాలాంధ్ర-పాడేరు : భారతీయ విద్యా కేంద్రం పాడేరు విజ్ఞాన భారతి పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఎస్ పి ఎల్, ఏ ఎస్ పి ఎల్, జిపిఎల్ ఎన్నికలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ వై ఆచారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ ఎన్నికల్లో బి నవదీప్, ఎస్‌పిఎల్‌గా ఎన్నికయ్యాగా, ఏఎస్‌పిఎల్‌గా జి ఆర్య వర్ధన్, వి పూజిత, జిపిఎల్‌గా కె ఉశ్శశ్రీ, ఏజిపిఎల్‌గా, ఎన్నికయరని ప్రధానోపాధ్యాయులు ఏ వై ఆచారి తెలిపారు. ఈ కార్యక్రమ డిసి చైర్మన్ మతం సూర్యనారాయణ నాయుడు, కరస్పాండెంట్ టి బాబురావు, ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులు ఆటపాటల్లో మరింతగా చురుకుగా పాల్గొని విద్యార్థిని విద్యార్థుల ఆరోగ్యాలు సుఖవంతంగా ఉంచుకోవాలన్నారు.

పాఠశాలలో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థిని విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలన్నారు.విద్యార్థినీ విద్యార్థుల సమస్యలు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలి అంటే లీడర్షిప్ అవసరమని వారన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్లపై వదిలేసే పశువులను రైతులు కట్టడి చేయాలి : తహసీల్దార్

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : ఏజెన్సీలో 516ఇ జాతీయ రహదారిపై పశువులు విచ్చలవిడిగా తిరుగుతుండడంతో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు, కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు,ఈ విషయం పత్రికల ద్వార,ప్రజాప్రతినిధులు ఫిర్యాదులమేరకు విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్,శుక్రవారం రాజవొమ్మంగి వచ్చిన ఆయన అధికారులతో మాట్లాడుతూ పశువులను కట్టడి చేయని యజమానులు పై చర్యలు చేపట్టాలంటూ అధికారులను ఆదేశించడం జరిగిందని తహసీల్దార్ అల్లు సత్యనారాయణ తెలిపారు,పశువులను రోడ్లపై వదిలేసే రైతులకు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని,తీరు మార్చుకోకపోతే వారిపై చర్యలు చేపట్టి రోడ్లపై తిరుగుతున్న పశువులను గోశాలకు తరలించాలంటూ తెలిపినట్లు తహసీల్దార్ తెలిపారు,ఈ కార్యక్రమంలో ఎస్సై నరసింహమూర్తి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజుల ఉన్నారు.

## పరిశుభ్రతతో వ్యాధులు దూరంలి : డీఎంహెచ్ఓ

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్. భాస్కరరావు కోరారు. బందలుప్పి లో శనివారం నిర్వహించిన స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో వైద్య బృందంతో కలిసి ఆయన పాల్గొన్నారు.పిహెచ్సి ఆవరణలను శుభ్రపరిచారు. గ్రామంలో కాల్వల్లోని పూడికలను, నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. దోమల లార్వా ప్రదేశాలను గుర్తించి వాటిని శుభ్రపరచాలని ఆదేశించారు. గ్రామస్తులకు లార్వాను ప్రదర్శించి చూపి అవగాహన కల్పించారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధులకు కారణం నీటి నిల్వలు, అపరిశుభ్రత అని, ప్రజలందరూ గమనించి తగు జాగ్రత్తలు పాటించాలని పరిసరాలతో పాటు ఎప్పటికపుడు చేతులను శుభ్రం చేసుకోవాలని,ఇంటి ప్రాంగణంలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. పిహెచ్సీ ఆవరణలు పరిశుభ్రంగా ఉంచుతూ రోగులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని వైద్యులకు, సిబ్బందికి సూచించారు.స్వచ్ఛఆంధ్ర నోడల్ అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు మాట్లాడుతూ %బాాబాా% లో బాగంగా ప్రతీ నెలా ఒక సారాంశం ఉంటుందని,ఆగస్టు నెల థీమ్ వర్షాకాలం-పరిశుభ్రత అని తెలిపారు.అందరూ పరిశుభ్రత పాటిస్తూ అంటు వ్యాధులకు గురికాకుండా ఉండవచ్చని తెలిపారు.పిహెచ్సీ స్వచ్ఛ ఆంధ్ర నివేదికల పురోగతికి కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డా రఘు కుమార్,డిఎంఓ మణి, ఎపిడిమియాలజిస్ట్ డా కౌశిక్, వైద్యాధికారి డా శ్రీకాంత్,ఎఎంఓ సూర్యనారాయణ, సూపర్వైజర్ నాగమ్మ,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ్ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**ఏఎంసీ ఛైర్మన్: ముఖి సూర్యనారాయణ**

విశాలాంధ్ర-పాచిపెంట : ప్రజలు భాగస్వామ్యంతోనే స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం విజయవంతం అవుతుందని ప్రజా సంక్షే మే సీఎం నారా చంద్రబాబు నాయుడు ముఖ్య ఉద్దేశం అని సాలూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ అన్నారు. మండల ప్రత్యేక అధికారి రాధాకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం ను పాచిపెంట మండల కేంద్రంలో అధికారులు శనివారం నిర్వహించారు. బీసీ కాలనీ అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించారు ఈ కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కాలేజ్ విద్యార్థులతో గ్రామాల అభివృద్ధి, పరిశుభ్రత పై ర్యాలీ చేశారు. మన ఆరోగ్యం - మన పరిశుభ్రత నినాదంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని ఆయన అన్నారు. ప్రతి విషయని ప్రజల్లోకి తీసుకెళ్లాలి, గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుయని డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ గ్రామాల అభివృద్ధి పై ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని మంత్రి గుమ్మడి సంధ్యారాణి చొరవ అభినందనీయమని సూర్యనారాయణ అన్నారు. రేపటి తరానికి విద్యార్థుల భవిష్యత్ అని ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాచిపెంట మండల ప్రత్యేక అధికారి రాధాకృష్ణ అన్నారు. గ్రామాలు బాగుండాలంటే ప్రజల సహాయకారం ఎంతైనా అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధి, గ్రామాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాచిపెంట ఎంపీడీవో బివిజే పాత్రో, సాలూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ పూసర్ల నర్సింగ్ రావు, ఐసిడిఎస్ సిడిపిఓ బొత్స అనంతలక్ష్మి, ఈఓపిఆర్డీ పి మల్లేశ్వరరావు, ఏపిఎం రెడ్డి శ్రీరాములు, సర్పంచ్ పాచిపెంట సంతోషి, ఎంపీటీసీ దండి ఏడుకొండలు, ఎంఈఓ 2 సతీష్ కుమార్, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, వెలుగు సిబ్బంది విద్యార్థులు హాజరయ్యారు.

## ఎరువుల దుకాణాలను మండలస్థాయి అధికారులు తనిఖీలు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని ఎరువులు షాపులను మండల తహసిల్దార్ ప్రసన్నకుమార్ , వ్యవసాయ అధికారి అవినాష్, సబ్ ఇన్స్పెక్టర్ రాజేష్లు కలిసి ఎరువులు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. మండల రెవెన్యూ అధికారి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ మండలంలోగల ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేయడం జరిగిందని, ఈ తనిఖీల్లో ఎరువుల దుకాణం దస్త్రాలను పరిశీలించి, గోదాము నిల్వలలో ఎరువుల నిల్వలను పరిశీలించామన్నారు. ఈనిల్వలలో తేడా ఉండకూడదని తెలియచేశారు. అలానే ఎరువుల దుకాణం యజమానులు వారి వారి నిల్వలను, ధరల పట్టికలను దుకాణం ముందు ప్రదర్శించాలని తెలియచేశారు. ఎవరైనా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. సబ్ ఇన్స్పెక్టర్ రాజేష్ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా అక్రమ నిల్వలు ఉంచితే వాళ్ళ మీద 6ఎ కింద కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. మండల వ్యవసాయఅధికారి అవినాష్ మాట్లాడుతూ మండలంలో గల మూడు రైతు సేవకేంద్రాలకు, రెండు పి.ఏ.సి.ఎస్ లకు యూరియా రావడం జరిగిందని తెలియచేశారు. రైతులకు అవసరమయిన యూరియా అందుబాటులో ఉందని తెలియచేశారు. ప్రతి రైతు సేవ కేంద్రంలో, ఎరువుల దుకాణం నందు ప్రతి రైతుకు ఆధార్ కార్డు మరియు భూమిపుస్తకం ఆధారంగా డి.బి.టి ద్వారా వేలు ముద్ర వేసిన తర్వాత మాత్రమే ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేయాలని తెలియచేశారు.

## బలమైన పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర-జీకే వీధి : బలమైన కార్మిక పోరాటాల ద్వారానే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని. సిఐటియు జిల్లా అధ్యక్షులు. బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. శనివారం జీకే వీధి మండలం సిఐటియు మహాసభ సిఐటియు కార్యాలయంలో అప్పల నరస ఆధ్వర్యంలో మహాసభ జరిగింది. ముఖ్య అతిథిగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ కార్మికులు సమస్యల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వాల ఆలోచన విధానాల వల్ల పరిష్కారం చేయడం లేదని మండిపడ్డారు. ఒకవైపున ధరలుఆకాశాన్ని అంటుతున్న పనిచేసే కార్మికుల వేతనాలలో పెరుగుదల లేదని మండపడ్డారు. కార్మికుల యొక్క శ్రమను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దోసుకుంటున్నయని అన్నారు. దేశవ్యాప్తంగా సమ్మెలో 30 కోట్ల మంది పాల్గొని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఒక తాటి పైన వచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వాలు ఏదైనా కార్మికుల సమస్యలు పరిష్కారం చేయడంలో విఫలమవుతున్నారని కార్మికులు అందరూ ఒక తాటిపైకి వచ్చి ప్రభుత్వాలు కదిలే బలమైన పోరాటాలు చేయడం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండలం కార్యదర్శి. గడుతూరి సత్యనారాయణ. మండల అధ్యక్షులు వెంకటి, జెన్కో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు లక్ష్మణరావు, విష్ణుకుమార్ రాజు సత్యవతి. ఈశ్వరమ్మ, మీనాక్షి, కుమారి గోపాల్ చిన్నతల్లి, వీఆర్ఏ నాయకులు సూర్యనారాయణ. తదితరులు పాల్గొన్నారు.

## యూరియా, ఎరువులపై విజిలెన్స్ తనిఖీలు

విశాలాంధ్ర-పార్వతీపురం : యూరియా, ఎరువులపై విజిలెన్స్ తనిఖీలు నిర్వహించామని ప్రాంతీయ నిఘామరియు అమలు శాఖాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్ హరీశ్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు శనివారం తనిఖీలు నిర్వహించామన్నారు. పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ ఉత్తర్వుల మేరకు తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి, పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ తో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 15 బృందాలతో, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగానికి చెందిన రెండు ప్రత్యేక బృందాలు కలిసి అన్ని మండలాల్లో తనిఖీలు నిర్వహించాయని ఆయన తెలిపారు. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగానికి చెందిన రెండు ప్రత్యేక బృందాలు మండల బృందాలతో కలసి పాలకొండ, బత్తిలి, భామిని లలో తనిఖీలు చేశాయన్నారు. జిల్లాకు చేరిన యూరియాను సక్రమంగా ప్రతి రైతుకి అందుబాటులో ఉండేలా ఇ - పాస్ విధానం ద్వారా అందరికీ పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎరువులను సక్రమంగా వినియోగించుకోవాలని, అవసరం మేరకే ఎరువులు కొనుగోలు చేయాలని ప్రసాదరావు అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్త వీధి మండలానికి చెందిన గూడెం అర్ధరవీధి గ్రామానికి చెందిన సాగిన వీరన్నపడాల్, బి.ఎస్ సి,బి.ఈడి పూర్తి చేసి ప్రస్తుతం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పరీక్షల కోసం సిద్ధమవుతున్నారు.ఈ సందర్భంగా, అతనికి అవసరమైన స్టడీ మెటీరియల్ను గూడెం కొత్త వీధి మండల డిప్యూటీ తహసీల్దార్ దుమంతి సత్యనారాయణ అందించారు. అభ్యాసంలో ఉన్న యువతకు సహాయం చేయాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు దుమంతి సత్యనారాయణ తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థులు అధిక స్థాయిలో విజయాలు సాధించాలన్న ఆశయంతో ఈ ప్రయత్నం చేసినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా సాగిన వీరన్నపడాల్ తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, "ఈ మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నాను. సత్యనారాయణ యొక్క సహాయం నా పై విశ్వాసాన్ని పెంచింది," అని అన్నారు. సామాజిక బాధ్యతగా ఈ విధంగా విద్యార్థులకు సహాయంగా నిలిచిన దుమంతి సత్యనారాయణకి గ్రామస్థులు అభినందనలు తెలియజేశారు.

## ఘనంగా పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టినరోజున వేడుకలు

విశాలాంధ్ర-జికె వీధి : జీకే.వీధి మండల జనసేన పార్టీ నాయకులు ఆధ్వర్యంలో పద్మ విభూషణ్ మెగాస్టార్ కొణిదెల శివశంకర వరప్రసాద్ చిరంజీవి 70 పుట్టినరోజున గూడెం కొత్త వీధి మండలం రింతడ పంచాయతీ కేంద్రంలో చిన్న పిల్లల సమక్షంలో కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగి సినీ అభిమానుల హృదయాలలో చిరంజీవిగా, మెగాస్టార్ సినీ పరిశ్రమకు తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకొని సినీ కార్మికుల సంక్షేమాన్ని సైతం అండగా ఉంటూ నేత్రదానం, రక్తదానం వంటి అనేక కార్యక్రమాలు చేస్తూ అనేకమంది పేద ప్రజల కష్టనష్టాలలో తన మార్కును చూపిస్తూ ఎంతోమందికి ప్రాణదాతగా నిలిచిన చిరంజీవికి ఇవే మా ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని అనేకమంది ప్రాణాలకు మీరు అండగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుని మీరు నిండు నూరేళ్లు ఆరోగ్య ఆనందాలతో వర్ధిల్లాలని ఈ ప్రయాణం మరింత మందికి ఆదర్శం కావాలని జనసేన పార్టీ నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్, కొయ్యం ఇమ్మానుయేల్(సిద్దు) ఉపాధ్యక్షులు మాచర్ల, అనిల్, పాంగి గిరిబాబు, కార్యదర్శి గేమ్మిలి వినీత్, వంచుల పంచాయితీ ఉపాధ్యక్షులు రఘు వంశీ వనపల ఈశ్వరరావు, యువ నాయకులు పాంగి శ్రీను, ప్రధాన కార్యదర్శి వంచుల జార్త, బాబీ, పంచాయితీ ప్రధాన కార్యదర్శి మడపల సోమేశ్కుమార్, అఖిల్ పెంట్రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి సీఐ నరసింహామూర్తి

విశాలాంధ్ర-అడ్డతీగల : స్థానిక మండల కేంద్రంలో గల సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహమూర్తి కార్యాలయంలో మరియు ఎస్ఐ బి వినోద్ అడ్డతీగల మండలంలో గల గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులను అందర్నీ పిలిచి వారితో సమావేశమై ఈ క్రింది విధంగా గణేష్ విగ్రహ ప్రతిష్ట మండప నియమాలను వారికి వివరించారు. గణేష్ మండపాలు నిర్వహించేవారు కచ్చితంగా పోలీస్ గవర్నమెంట్ సైట్ https://ganeshut-sav.net నందు లాగిన్ అయ్యి తగు నియమాల ప్రకారం అనుమతి పొందవలెను. గణేష్ మండపాలు పెట్టే స్థలం యొక్క అనుమతుల కొరకు ఆయా పంచాయతీలో కచ్చితంగా అనుమతి పొందవలెను అది ప్రైవేట్ స్థలం అయితే ఆ స్థలం యొక్క యజమాని తో కచ్చితంగా అనుమతి పత్రం పొంది ఉండాలి. గణేష్ మండపంలో ఏర్పాటు చేయు కరెంటు కొరకు కచ్చితంగా ఎలక్ట్రిసిటీ వారి అనుమతి కచ్చితంగా పొందవలెను. ఊరేగింపు సమయంలో ఏ విధమైన డీజేలకు అనుమతి లేదు. నిమజ్జన సమయంలో విగ్రహాన్ని తీసుకువెళ్లే వాహన వివరాలను మరియు ఏ ప్రదేశం వద్ద నిమజ్జనం చేస్తున్నారో ఆ యొక్క వివరములను కూడా పోలీసు వారికి ముందుగా తెలియపరచవలెను. పై నియమాలను ఉల్లంఘించి మండపాలు ఏర్పరచినచో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అడ్డతీగల సీఐ నరసింహామూర్తి ఈరోజు గణేష్ నిమజ్జన కమిటీ సభ్యులకు తెలియజేశారు.